కథానిక

# సరికొత్త పాతకథ

ఏ. వి. నరసింహారావు

చంద్రుడు లేని నల్లటి ఆకాశంలో తెల్లగా మెఱుస్తున్నాయి నక్షత్రాలు. ఎదురుగా వున్న కోవెల మండపం మీద గుడ్లగూబ కూస్తోంది. బయట పొలాల్లో నక్కలు శక్తి కొలదీ అరుస్తున్నాయి. అప్పుడే భోజనం ముగించి వీథిలోనికి వచ్చిన నాదృష్టి సరాసరి మా యింటికి ఎదురుగా వున్న మా దూళ్ళ సావిడిమీద పడింది. గాలిలేక ప్రశాంతంగా వుండటంచేత సావిడి అరుగుమీద వున్న దీపం ఆకాశంలోని నక్షత్రంవలె మెఱుస్తోంది. ఎవరేనా దారిన పోయేబాటసారులు బసచేశారనుకున్నా. "తాగనాకి కడుపునిండా గంజేనా లేదు. ఈవారం బత్తెం మొన్నటితోటే అయిపోయినాది. ఎల్లుండిదాకా కామందులు గింజలు కొలవరు. సందాలదాకా దూళ్ళతో సహా చేలనక, పుట్టలనక తిరిగొస్తే గుక్కెడు అంబలి తప్ప ఏమీ లేదు. ఒకడి సంపాదనమీద ముగ్గురు బతకాలంటే ఎలా గడుస్తుంది!" అని సణుగుకొంటూన్న మా పాలికాపు అప్పిగాడి గొంతుక వినబడింది.

మొన్న నేను వేసంగి సెలవలు అయిపోయి వెళ్ళేవరకూ గూడ వాళ్ళ గూడెంలోనే నివసించిన మన అప్పిగాడి కుటుంబం సావిడి అరుగుమీదకు మారడానికి గల కారణాన్ని వూహిస్తూనే అరుగుదిగి సావిడివైపు నడచాను. ఇదివరకు ఆ కుటుంబంలో అప్పిగాడు అనే పేరుతో మా దూళ్ళను కాస్తూన్న పది, పదకొండేళ్ళ కుర్రాడితో తప్ప మరెవరితోటీ నాకు పరిచయంలేదు. ఇదివరకే వాడి కుటుంబచరిత్ర తెలిస్తే వాడిని చరితార్థుణ్ణి చేసేవాడిని. వెంటనే ప్రశ్నించాను.

"ఏంరా అప్పిగా! ఈ అరుగుమీద వుంటున్నారేం?"

మూకుడులో వున్న అంబలి నసుకుంటా రెండుచేతుల్తోటీ ఎత్తి, నోట్లో పోసుకొని, తేనుపుకూడా అయిపోయిన తరువాత జాలిగా నాకేసి చూస్తూ సమాధానమిచ్చాడు:

"సుబ్బిగాడు చేసిన దొంగతనాలంటినీ, చిన్నాన్నగారితోటి మేమే చెప్పేమని, సుబ్బిగాడూ, మిగతా మా కులంవోళ్లు మమ్మల్ని గూడెంలోంచి వెగ్గొట్టించేశారండి" అన్నాడు.

"సుబ్బిగాడు మన పనిలోనికి రావటంలేదా?" అన్నా.

లేదన్నట్లు తల వూపుతూ "చిన్నాన్నగారే మానేయమన్నారండి" అని జవాబు చెప్పాడు.

మానేయమనక ఏంజేస్తాడు? అటువంటివాడు ఒకడు, ఒకటి రెండేళ్ళు కమతంలో వుంటే, యింట్లోవుండే గునపాలు, పారలు మొదలైనవి వాటంతట అవే మాయమవుతాయి. సావిడ మిద్దెమీద వున్న నులకే గాకుండా, వెదుళ్లు కూడా విమానాల్లాగ రాత్రికి రాత్రే ఎగిరిపోతాయి. దూళ్ళన్నీ సమృద్ధిగా తింటూన్నా మూడునెలలుదాకా తరగని గడ్డిమేట్లు మూడురోజులకు కూడా చాలవు. పెళ్ళిళ్ళు కార్యాలూ అయినప్పుడు యింటికి వచ్చిన చుట్టాల కాలిజోళ్లు గుమ్మందగ్గరవి గుమ్మందగ్గరే మాయమవుతాయి. ఇవాళ పెద్దవిగా కనిపించిన పుల్లల గుట్టలు, రేపటికే సగం తరిగిపోయినట్లు అగపడతాయి. ఇలాంటి కృత్యాలు జరిగినప్పుడు మొదట్లో మాకు ఆశ్చర్యంగానే వుండేది. రానురాను మా యింట్లో అందరికీ సుబ్బిగాడిమీద అనుమానంగావుండేది. అది మొన్న నేను పట్టణం వెళ్లినపుడు అప్పిగాడి సాక్ష్యంవలన ఋజువయియుంటుంది. అందుమూలంగా సుబ్బిగాడు కమతం మానివేయడం, అప్పిగాడి కుటుంబం సావిడి అరుగు

మీదకు మారడం ఒకేసారి జరిగివుంటాయి.

అసలు సంగతి చెప్పడం మరచిపోగూడదు. ఇందాకటినుండీ అప్పిగాడి ప్రక్కనే కూర్చొని యిప్పుడు వాడు తినేసిన మూకుడులో అంబలి తాగుతోంది, వాడి చెల్లెలే అనుకుంటూ. కాని నా సందేహాన్ని తీర్చుకోవడంకోసం వెంటనే ప్రశ్నించాను.

"ఈ పిల్లెవర్రా?"

"మా చెల్లేనండి. మంగమ్మ" అని నోటిలోని చుట్ట తియ్యకుండానే జవాబు చెప్పాడు.

ఇంతట్లో ఒక ఎర్రని పొడా ఎత్తుమనిషి, ఒక కర్రని వూతగా కుంటుకుంటూ వచ్చాడు. మొహంలో అప్పిగాడి పోలికలు చాల అగుపడుతున్నాయి. చాలా నీరసంగా వున్నాడు. ఎముకలు పైకి కనపడుతున్నాయి. కొంచెం తలమీద వెంట్రుకలు నెరసినా నడివయస్సువాడనే చెప్పాలి. తన శక్తికిమించిన వెలుతురని ఆముదం దీపం యివ్వలేదు కాబట్టి వాడు కుంటడానికి గల కారణం వాడే చెప్పేదాకా నాకు తీరని సమస్యఅయి నిలిచింది. "ఏంరా బాబా! ఇంతసేపూ బయలుభూమికి వెళ్లడమేనా" అని అప్పిగాడు వేసిన ప్రశ్న ఈ కుంటిమనిషి అప్పిగాడి తండ్రి అవునా, కాదా అన్న నా సందేహాన్ని తొలగించింది. ఒకగంట క్రితం "ఒకడి సంపాదనమీద ముగ్గురు బ్రతకాలి" అని అప్పిగాడు అనడం మరచావనుకుంటూ.

"మీఅమ్మ కనబడదేంరా?" అని అడిగాను.

అప్పిగాడు వినబడీ వినబడనట్లు వూరుకొన్నాడు.

కాని వాడి తండ్రి మాత్రం "అదుంటే మాకీపంచలని జేకేగతి ఎందుకు పడుతుందండి" అంటూ, చేతికర్రను అరుక్కొజేరేసి అరుగుమీద చతికిలబడ్డాడు.

నేనుగూడ కూర్చుంటూనే "చచ్చిపోయినదా? ఎప్పుడు? పాపం!" అన్నాను.

"చచ్చినా శని విరగడవునండి" అంటూ ఏదో చెప్పబోయి మానేసినట్లగపడ్డాడు. తరువాత నా కోరికమీదే, ఈ క్రింది విధంగా చెప్పడం మొదలెట్టాడు.

"నా జీవితంలో కష్టమంటే ఏమిటో తెలియనటువంటి రోజులవి. నేనప్పుడు పట్నంలోవున్న మిల్లులో పనిచేసేవాణ్ణి. నెల ఆయేసరికి నలభై రూపాయలు చేతికొచ్చేవి. హాయిగా ఖర్చుపెట్టుకొనిపిల్లలూ, భార్యా, నేనూ సుఖాన్ని అనుభవించేము. అప్పుడు అప్పిగాడు అయిదేళ్ళవాడు. మంగమ్మకు ఒక సంవత్సరం నిండింది. తెల్లారి ఆయేసరికలా మిల్లుకూత వినగానే చద్దిగంజి తాగేసి పనిలోకి పోయేవాణ్ణి. పన్నెండు ఆయేసరికి యింటికివచ్చి మధ్యినంకూడుతిని ఒకగంట కునుకోయేవాణ్ణి. మళ్ళీ రెండు గంటలకి వెళ్ళి, ఆరయేసరికి కొంపచేరేవాణ్ణి. మీ దయవల్ల పొటదుతే కూటికిలోటెందు కుంటుందండి? అప్పిగాడు కూడ పెద్దయ్యేక నాలాగే మిల్లులో పనిచేస్తాడనుకున్నా. పెద్ద పిల్లలిద్దర్నీ పల్లెల్లో కూలిపని చేసేవాళ్ళకే యిచ్చేనుగనా, మంగమ్మనైనా బస్తీలో ఏ మిల్లులోనో పనిచేసేవాడికి యిద్దామనుకున్నా. కాని నా ఆశలన్నీ యిలా బూడిదలో కలుస్తాయని ఎరికి తెలుసునండి? తానోటి తలస్తే దైవమోటి తలచినట్లయిందండి" అంటూ కళ్ళవెంబడి నీళ్లు కార్చడం మొదలెట్టాడు, నా సానుభూతికోసం ఎదురుచూస్తున్నవాడిలా.

అసలు జరిగిన విషయమేమిటో తెలుసుకోకుండా సానుభూతి చూపడం నా ఒక్కడికే కాదు, ఎవరికైనా కష్టదాయకమే! కాని సానుభూతి చూపితేనే గాని తరువాత కథ చెప్పేటట్టులేదు. వాడు కళ్ళనీళ్ళను కార్చ




దాన్ని బట్టి ఏదో భయంకర సంఘటన జరిగిందనుకోవాలి. "సరే! నీ మనస్సుకు అంతకష్టమయినసంగతి ఏమిజరిగింది?" అని ప్రశ్నించాను ప్రేమగా.

"నే నావేళ లేస్తూనే ఏది పాడు మొగం చూశానో చెప్పలేను. మామూలుగానే చద్ది గంజి తాగి పనిలోకి పోయే. అంత క్రితం రాత్రి, తేలు కుట్టడం వల్ల నిద్రను మర్చిపోయి తెల్లవార్లూ బాధపడ్డా. అందుచేత మత్తుగా చద్దిగంజి తాగానేమో పనిచేస్తూంటే కునుకుపాట్లు వచ్చాయి. కునుకుతూ కునుకుతూ వేగంగా తిరిగే చక్రంలో పడిపోయాను. అదృష్టమో, దురదృష్టమో చెప్పలేనుగాని నా కాలొక్కటే చక్రంలో పడి నలిగిపోతుంటే తోటి పనివాళ్ళు చూసి యింజను ఆపుజేశారు వెంటనే. ఎడం కాలి పాదం అంతా పిప్పి పిప్పి అయిపోయింది. వైద్యం చేయించమని యజమానిని ఎంతో వేడుకున్నా. కాని లాభం లేకపోయింది. అందరూ ఒకలాగే వుంటారా? నేను పిడతలో జాగర్త చేసిన డబ్బు పదిహేను రూపాయలుంటే అవితీసుకెళ్ళి నా పెళ్లాం నేనూ డాక్టరు కాళ్ళమీద పడ్డాం. ఆయన చాలా మంచివాడు. ఒక యిరవయి రోజులలో నా దెబ్బ మాన్పేశాడు. పాదం వంకర పోవడమే గాకుండా వేళ్ళన్నీ నాశనమయాయి. ఒక కర్రని ఆధారంగా చేసుకొని కుంటు కుంటూ మా యజమాని దగ్గరకు వెళ్ళే, కుంటివాడ్ని పనిచేయలేననివుద్యోగంలోంచి తీసేసేనన్నాడు. గేటు దగ్గర పనేనా యిప్పించమని చాలాసేపు వేడుకున్నా ఫలితం లేకపోయింది" అంటూ నిట్టూర్చాడు.

నా గుండెలో పెద్దరాయి పడినట్లయింది. సావడి దొడ్డిలో తాటిపండు పడిన చప్పుడు. అంత గాఢ నిద్రలోవున్న మంగమ్మ లేచి, ఒక చిటికలో కల్లా ఒక నల్లని పెద్ద తాటిపండుని చేత్తో పట్టుకొని వచ్చింది. మిగిలిన రెండు టెంకల్ని నా ప్రక్కనున్న తాటాకు మీద పెట్టి, తన భాగానికి చెందిన టెంక నొకదాన్ని రెండు చేతుల్తోటీ పట్టుకొని పళ్లతో పీకడం మొదలెట్టింది పాపం! అంత క్రితం తాగిన అంబలితో సంతృప్తిపడి వుండదు. ఆకలికి ఆగలేక రోజూ మంగమ్మ ఈ కార్యక్రమానికి అలవడిందనుకున్నా.

వస్తూ వస్తూన్న నిద్ర నాపుచేసుకుంటూ అప్పిగాడి తండ్రి చెప్పడం సాగించాడు. "నేను కుంటివాణ్ణయి పోయాను గదా తనకు తగిన భర్తను గానని, అప్పిగాడినీ, మంగమ్మనూ, నా దగ్గర విడిచిపెట్టి, ఇంకొకడితో రాత్రి రాత్రే లేచిపోయింది నా భార్య. వేరే గతిలేక ఈ వూళ్ళో వున్న కూతురు దగ్గర కొచ్చేశా. అదు కుక్కుంటూనో, మొత్తుకుంటూనో ఒక అయిదేళ్లు పోషించిందండి మమ్మల్ని. తరవాత దానికీ మాకూ పడలేదండి. ఒక సంవత్సరంపట్టి అప్పిగాడిని తమ కవతంలో పెట్టి వాడి సంపాదన మీదే బతుకుతున్నాము. మొన్న వాళ్ళు గూడెంలోంచి వెళ్ళిపొమ్మంటే, చిన్నాన్న గారి అరుగుమీద వుండమన్నారు. ఏదో మీ దయవల్ల ఒకపూటైనా కడుపునిండా గంజి తాగుతున్నామండి. ఇక నాకూ, నా పిల్లలకూ పరవాలేదండి" అని తన ధైర్యాన్ని వెలిబుస్తూ కథ ముగించాడు.

నేను అరుగుదిగి పోబోతూంటే "అప్పిగాడికి ఒక పాతచొక్కా వుంటే దయ చేద్దురూ? వచ్చేది చలికాలం" అన్నాడు దీనంగా. "అలాగేలే" అని మా యింటిలోకి పోయి వీథితలుపు వేసుకొని పడుకున్నా. కాని నిద్ర పట్టలేదు. వింతఅయిన ఆలోచనలు మనస్సులో ప్రయాణం సాగించాయి. అప్పిగాడి తల్లి పట్టణంలో ఎక్కడ వుంటుంది? రమ్మని చెబితే వస్తుందా? అది వస్తే అప్పిగాడి తండ్రి రానిస్తాడా? ఒకవేళ వాడు రానిస్తే వాడి కులంవాళ్ళు పూరుకుంటారా? రాత్రంతా ఈ విధమైన ఆలోచనలతోనే గడిచింది. తెల తెల్లారుతుంటే నిద్రపట్టింది గాని, అప్పిగాడు వాకలి తుడుస్తూన్న చీపురు శబ్దానికి లేచి పోయాను.

---

యుద్ధంలో మానవులు పరస్పర శ్రేయస్సు కోరి ఏవిధంగా తమ ప్రాణాలు అర్పిస్తున్నారో- అలాగే శాంతికాలంలో కూడా కలసి మెలసి, పరస్పరోపకార బుద్ధితో జీవించే పద్ధతి మనం అలవరచుకోవాలి— జెనరల్ ఓమర్ బ్రాడ్లీ.